



ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇంకిపోయిన నీరు

డెడ్ స్టోరేజీకి ఎల్లంపల్లి

గణనీయంగా తగ్గిన నీటిమట్టం

20టీఎంసీలకు ప్రస్తుతం 4 టీఎంసీలే

వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ప్రభావం

హెచ్ఎండబ్ల్యూఎస్, ఎన్టీపీసీకి నీటి సరఫరా యథాతథం

ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో నీరు అడుగంటుతోంది... తీవ్ర వర్షాభావ పరిస్థితులతో డెడ్ స్టోరేజీకి చేరుకుంటోంది... గతేడాది రివర్స్ పంపింగ్‌తో ప్రాజెక్ట్ నీటితో కళకళలాడగా ఈ యేడు మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్ట్‌ల మరమ్మతుల కారణంగా పంపింగ్‌కు అవకాశం లేకుండాపోయింది. 20.175 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 4.08 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్ట్‌కు జలకళ రానుంది.


మంచిర్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలం గుడిపేటలో గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. ఓ వైపు ఎండలు ముదరడం, మరోవైపు తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరు పూర్తిగా అడుగంటుతోంది. అలాగే వివిధ పనుల నిమిత్తం ఇన్ని రోజుల వరకూ కొన సాగిన నీటి కేటాయింపుల వల్ల కూడా ప్రాజెక్టులో నీటి మట్టం అడుగంటుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి 434 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. హైద్రా బాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం హైద్రాబా ద్ మెట్రోపాలిటన్ వాటర్ స్కీం (హెచ్ఎండబ్ల్యు ఎస్) కోసం 313 క్యూసెక్కులు, రామగుండంలోని ఎన్టీపీసీ పంప్‌హౌజ్‌కు 121 క్యూసెక్కుల నీటిని యథాతథంగా విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో గూడెం లిఫ్ట్, వేమునూరు పంప్ హౌజ్, నంది పంప్‌హౌజ్‌లకు నీటి విడుదల నిలిపివేశారు.

అందుబాటులో 4.08 టీఎంసీలు

వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రాజెక్టులో ప్రస్తుతం 4.08 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 4.08 టీఎంసీలకు పడిపోయింది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో దాదాపు 10 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం 4 టీఎంసీలే ఉంది. ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ పంప్ హౌజ్‌కు నీరందించే ఇన్‌టెక్ వెల్ వద్ద వారం రోజుల్లో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. వారం రోజులుగా ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఈ నెల 10న 4.58 టీఎంసీలు ఉన్న నీటి మట్టం 11న 4.56, 12న 4.50, 13న 4.45, 14న 4.40, 15న 4.36, 16న 4.31, 17న 4.25, 18న 4.20, 19న 4.15, 20న 4.12, 21న 4.08 టీఎంసీలకు నీటి మట్టం పడిపోయింది.

దోబూచులాడుతున్న మబ్బులు

మూడు రోజులుగా వర్షం ప్రజలను ఊరిస్తోంది. మబ్బులు పట్టి ఉరుములు, పిడుగులు పడుతున్నా చిరు జల్లులకే పరిమితం అవుతోంది. ఎగువున సైతం వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులోకి కొత్త నీరు చేరడం లేదు. గతేడాది సుందిళ్ల ప్రాజెక్టు నుంచి రివర్స్ పంపింగ్ కారణంగా ప్రాజెక్టులో నీరు కళకళలాడింది. ప్రస్తుతం మండే ఎండలకు తోడు వర్షాలు కురవకపోవడం, రివర్స్ పంపింగ్‌కు అవకాశం లేకపోవడంతో ప్రాజెక్టులో నీరు గణనీయంగా తగ్గిపోయింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కొద్ది రోజులుగా ప్రాజెక్టులో నిత్యం సగటున 0.5 టీఎంసీల మేర నీరు తగ్గిపోతోంది. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల మరమ్మతు పనులు సకాలంలో పూర్తయితేనే రివర్స్ పంపింగ్‌కు వీలవుతుంది. లేదా భారీ వర్షాలు కురిస్తేనే వరదలతో ఎల్లంపల్లి ప్రాజెక్టు తిరిగి జలకళ సంతరించుకునే అవకాశాలు ఉన్నాయి.



కనీస మట్టానికి పడిపోయిన నీటి మట్టం

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన రైతులు



బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న భూనిర్వాసితులు

ఏసీసీ, జూన్ 21: హాజీపూర్, లక్సెట్టిపేట మండలాలకు చెందిన నేషనల్ హైవే 63 బాధిత రైతులు బీజేపీ నాయకుడు తుల మధుసూదన్‌రావుతో కలిసి కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ నేషనల్ హైవే 63కు సంబంధించి ఇప్పటికే మూడు అలైన్‌మెంట్‌లు మార్చారని, అలైన్‌మెంట్‌ల మార్పు వల్ల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. కొందరు రియల్టర్లు, వ్యాపారులు మొదటి, రెండో అలైన్‌మెంట్లు మార్చి మూడో అలైన్‌మెంట్ ద్వారా రైతుల పొలాల నుంచి రోడ్డు వెళ్లే విధంగా చేశారన్నారు. ఇది వరకే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన తాము మరోసారి భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని, రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారన్నారు. రైతులు రాజమౌళి, తిరుపతి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచిర్యాల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుంచాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 21: మంచిర్యాల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందుంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయాన్ని కమిషనర్ మారుతిప్రసాద్‌తో కలిసి సందర్శించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలు, ప్రజాపాలన కౌంటర్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం అయినందున అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులను నిర్వహించాలని, పరిశుభ్రమైన తాగునీటిని అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని వార్డుల్లో వీధి దీపాల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలన్నారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడడంతోపాటు వార్డుల్లోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల్లో పూడిక లేకుండా శుభ్రపర్చాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా డ్రైడే కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆహారం తాగు నీటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

హాజీపూర్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్‌ను గుడిపేట 13వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ భాషా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు కాళిదాస్, నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు మారుతి, కుమారస్వామి పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: మందమర్రి జీఎం మనోహర్ కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. పర్యావరణ అనుమతులపై ఆయన ప్రస్తావించారు. ఏరియాకు సంబంధించిన పలు విషయాలను కలెక్టర్‌కు వివరించారు.

సీపీని కలిసిన కలెక్టర్

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌ను కమిషనరేట్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాద పూర్వకంగా కలిశారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష పాల్గొన్నారు.



సీపీతో మాట్లాడుతున్న కలెక్టర్, కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమాండెంట్

వస్తువుల నాణ్యత ప్రమాణాలపై అధికారులకు శిక్షణ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 21: మార్కెట్‌లో లభించే అన్ని రకాల ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలు తెలుసుకునేందుకు బీఐఎస్ కేర్ యాప్ వినియోగదారులకు సాధనంగా ఉపయోగపడుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, బీఐఎస్ శాస్త్రవేత్త సుజాత, ఎస్‌పీవో అభిసాయి ఇట్టలతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. నిత్య జీవితంలో వినియోగించే వస్తువులకు అందుబాటులో ఉన్న ప్రమాణాలు, నాణ్యత పరీక్షలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్‌లో వినియోగించే అన్ని రకాల ఉత్పత్తులకు హాల్‌మార్క్, ఐఎస్ఐ మార్క్ ప్రమాణాలతో హెచ్‌యుఐడీ సంఖ్యను కేటాయిస్తామన్నారు. మార్కెట్‌లోని ఉత్పత్తులకు బీఐఎస్ అనుమతులు జారీ చేస్తుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఐఎస్ఐ ముద్ర ఉన్న వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఉత్పత్తి నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు కేర్ యాప్ ఉపయోగపడుతుందని, యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని ఐఎస్ఐ మార్క్ ఉన్న ఉత్పత్తి ప్రామాణికత, లైసెన్స్ గడువు తెలుసుకోవచ్చని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బొగ్గు గనుల వేలంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ద్వంద వైఖరి

నస్పూర్, జూన్ 21: తెలంగాణలో సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ద్వంద వైఖరి అవలంభిస్తున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు ఆరోపించారు. ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ళుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ బొగ్గు బ్లాకులను ఆమోదించి సింగరేణిని వేలంలో పాల్గొనకుండా చేసి బినామీ కంపెనీలకు అప్పజెప్పిందని విమర్శించారు. కేటీఆర్ ప్రస్తుతం సింగరేణిపై కపట ప్రేమను వలకబోస్తున్నారని ఆరోపించారు. ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ హయాంలోనే బొగ్గు బ్లాకుల వేలం, సింగరేణిలో ప్రైవేటీకరణ మొదలైందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా స్థాయి వేతనాలు చెల్లించాలన్నారు. ఓపెన్‌కాస్టు గనుల తవ్వకాల్లో భూములు కోల్పోయిన, నష్టపోయిన స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. నాయకులు కమలాకర్ రావు, సామ్రాజ్ రమేష్, సత్రం రమేష్, ఈర్ల సదానందం, మొగిలి, చెల్ల విక్రమ్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్

యోగాతో ఆరోగ్యం



హైటెక్ సిటీలో యోగాసనాలు వేస్తున్న కాలనీవాసులు



యోగా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య



గుడిపేట బెటాలియన్‌లో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 21: యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో యోగా వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యోగా చేయాలని, అప్పుడే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. డీఎంహెచ్‌వో అనిత, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ రేఖ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ: పట్టణంలోని వైశ్య భవన్‌లో నిర్వహిస్తున్న యోగా వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రజలకు యోగా పట్ల అవగాహన పెంపొందించడంలో యోగా గురువులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అష్టోత్తర యోగా పీఠ్ గురువు విజయ్ ఆర్య, ఫిట్‌నెస్ సెంటర్ గురువు శ్రీనివాస్, వివేకానంద యోగా ట్రస్టు గురువు శ్రీనివాస్‌రెడ్డి, మైత్రియోగా ప్రకృతి చికిత్స కేంద్రం గురువు సుకుమార్, గురువులు శ్రీనివాస్, ముక్త వేణుల ఆధ్వర్యంలో యోగాసనాలను వేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి హాజరైన వారికి ఆహారం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, పీఈటీ గోపాల్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి వెంకటేశ్వర్, వంశీకృష్ణ, బాల మోహన్, ముఖేష్ పాల్గొన్నారు. వనితావాక్కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా గురువు జ్యోత్స్నచంద్రదత్ ఆధ్వర్యంలో జన్మభూమినగర్‌లో మహిళలు యోగాసనాలు చేశారు. పాత మంచిర్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు సాగర్, సభ్యురాలు మంజుల, హెచ్ఎం మాలవి పాల్గొన్నారు. భగవద్గీత అధ్యయన మండలి ఆధ్వర్యంలో గీత మండలి స్థాపకులు కృష్ణ రెడ్డి, కృష్ణ, హరీష్, సత్యం యోగాసనాలు వేశారు. న్యాయవాది నటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన యోగా వేడుకల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, ఉపాధ్యక్షుడు గంగయ్య, సీనియర్ న్యాయవాదులు కర్రె లచ్చన్న, భుజంగ రావు, మల్లారెడ్డి యోగాసనాలు వేశారు. హైటెక్ సిటీలో నిర్వహించిన యోగా వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, కాలనీ వాసులు పాల్గొన్నారు. రఘునాథ్ మాట్లాడుతూ యోగాతో ఎన్నో ప్రయోజనాలున్నాయని గుర్తించి అనేక దేశాల్లో ప్రజలు యోగా చేస్తున్నారన్నారు.

హాజీపూర్: గుడిపేట 13 బెటాలియన్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కమాండెంట్ జమీల్ భాషా ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువులు శోభగోపాలకృష్ణ, గోపిక, వినోద్‌లు బెటాలియన్ అధికారులు, సిబ్బంది చేత యోగాసనాలు వేయించారు. కమాండెంట్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని, మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు కాళిదాస్, నాగేశ్వర్ రావు, ఆర్ఐలు రవి, శ్రీనివాస్, కుమారస్వామి, మారుతి, సురేష్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దొనబండ జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు ఆధ్వర్యంలో యోగా గురువు శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల చేత పలు ఆసనాలు వేయించారు. విద్యార్థులు యోగా ముద్రలో కూర్చొని ప్రదర్శన చేశారు.

దండేపల్లి: లింగాపూర్‌లో ఆదర్శ పాఠశాల, కస్తూర్బా విద్యాలయంతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలలో యోగా వేడుకలు జరుపుకున్నారు. యోగా అక్షర రూపంలో విద్యార్థులు కూర్చొని పలు విన్యాసలు చేశారు. నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతోపాటు ఒత్తిడి లేకుండా ఉండవచ్చన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. యోగా చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. పాఠశాల సలహా సభ్యులు నల్మాస్ సంతోష్, ప్రధానాచార్యులు జుమ్మిడి నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమారం: పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీవో రాథోడ్ రాధ పిల్లల చేత యోగాసనాలు వేయించి యోగా ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు, పిల్లలకు వివరించారు.

కన్నెపల్లి: జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్, పీడీ వహీదాబేగంలు విద్యార్థుల చేత ఆసనాలు వేయించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు యోగా ఆకారంలో కూర్చుని ప్రదర్శన చేపట్టారు.

వేమనపల్లి: నీల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ శ్యామ్‌పటేల్, ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావులు విద్యార్థులతో కలిసి యోగా చేశారు. యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జడ్జి పర్వతపు రవి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. జడ్జి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యోగా చేయాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు.

జన్నారం: పైడిపెల్లి గార్డెన్‌లో మండల నాయకులు, అధికారులు యోగాసనాలు వేశారు. మధుసూదన్‌రావు, మున్వర్ ఆలీ, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పొన్నారంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య కూలీల చేత యోగసనాలు వేయించారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. రోజు యోగా చేయాలని సూచించారు.

ఎన్‌టీఏను తక్షణమే రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 21: జాతీయ పరీక్షలను నిర్వహించే ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ని తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్ డిమాండ్ చేశారు. పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వామపక్ష విద్యార్థి నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నీట్ పేపరు లీకేజీ, సీయూఈటీ పరీక్షలో పొరపాట్లు, యూజీసీ నెట్ పరీక్ష సమర్థవంతంగా నిర్వహించడంలో ఎన్‌టీఏ విఫలమైందన్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే విచారణ జరిపించాలని కోరారు. అరవింద్‌రెడ్డి, అభిరామ్, సిద్ధార్థ, దుర్గ రాజ్, ప్రవీణ్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఎన్‌టీఏను ప్రక్షాళన చేయాలని పాత బస్టాండ్ వద్ద ఏబీవీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ నాయకురాలు అక్షిత మాట్లాడుతూ ఎన్‌టీఏ చేసిన నిర్లక్ష్యానికి పరీక్ష రద్దు అయ్యిందని, విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు తిరుపతి, రాజ్‌కుమార్, శివకుమార్, దివ్య, శశిధర్ పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ సభ్యులు

బెల్లంపల్లి, జూన్ 21: తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థి దుర్గం చరణ్‌తేజ్ ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించగా శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చరణ్‌తేజ్ జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌లో ప్రతిభ కనబర్చి సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జేపీపీ శ్యాంసుందర్, రాజు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

నస్పూర్, జూన్ 21: జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగార్జున కాలనీ ప్రాణహిత స్టేడియంలో శుక్రవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్ ప్రారంభించారు. పోటీలు 21 నుంచి 26 వరకు జరుగుతాయని, వివిధ ప్రాంతాలకు చెందిన 12 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్ల సతీష్, నాయకులు రవీందర్, సీపతి రవి, శ్రీను, సుధాకర్, సురేష్, లడ్డు సాయి, భాను ప్రకాష్, సంపత్, అభిలాష్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఒలింపిక్‌డే రన్

ఏసీసీ, జూన్ 21: ప్రపంచ ఒలింపిక్ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రిలో ఈ నెల23న ఒలింపిక్‌డే రన్ నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి వాకర్స్ అసోసియేషన్, వివిధ క్రీడా సంఘాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు సింగరేణి హైస్కూల్‌గ్రౌండ్ నుంచి రన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వివేక్, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, సీఐ శశిధర్, జీఎం మనోహర్‌లు హాజరవుతారన్నారు.

నెలాఖరులోగా ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలి

ఏసీసీ, జూన్ 21 : మంచిర్యాల పట్టణ ప్రజలు ఈ నెల 30లోగా ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని కమిషనర్ మారుతి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పన్ను బకాయిలు ఉన్నవారు ఈనెల 30లోగా చెల్లించకపోతే 2 శాతం వడ్డీ విధిస్తామన్నారు. మున్సిపల్ ఆఫీస్ కౌంటర్‌లో, ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించాలని కోరారు.

బాల్క సుమన్‌ను అరెస్టు చేయడం హేయమైన చర్య

చెన్నూరు, జూన్ 21 : చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్టు చేయడం హేయమైన చర్య అని కౌన్సిలర్ రేవెల్లి మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డిని కలవడానికి వెళ్లిన బాల్క సుమన్‌ను, బీఆర్ఎస్ విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతపాలన కొనసాగిస్తుందన్నారు. వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జయశంకర్ ఆశయసాధనకు కృషి చేయాలి

దండేపల్లి జూన్ 21: ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ప్రతీ ఒకరు కృషి చేయాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కీలక పాత్ర వహించారన్నారు. నక్క కిషన్, పురేళ్ల నాగన్న, బొమ్మెన గంగాధర్, దైవాకర్, శ్రీకాంత్‌చారి, లక్ష్మీనారాయణ, దన్ననాల గంగారాం, కట్ల శ్రీధర్ రాజమౌళి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

దండేపల్లి, జూన్ 21: లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన దండేపల్లికి చెందిన కట్కూరి రాజన్నను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో దండేపల్లి ఎంపిటిసి సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, అఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ల వెంకటేష్‌సంఘం అధ్యక్షులు నూతల శ్రీకాంత్‌చారి, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీలకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న ఎంపీపీ

దండేపల్లి, జూన్ 21: అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ నాగరాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యలు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పూర్వ బాల్య విద్యవిధానంపై అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మూడేళ్లు దాటిన పిల్లలందరిని అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లలకు ఆటాపాటలతో విద్యనందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో రేష్మ, సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, పద్మకవిత, రమాదేవి, దీపావాహిని, మాస్టర్ ట్రైనర్లు లక్ష్మి, వెంకటలక్ష్మి, మండల అంగన్‌వాడి టిచర్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ చైర్మన్‌కు సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 21 : హైద్రాబాద్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రెడ్‌క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రాను శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చం అందించారు. మంచిర్యాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రానికి సింగరేణికి చెందిన సీనియర్ పాథాలజిస్టు డాక్టర్‌ను నియమించాలని వినతిపత్రం అందించారు. స్పందించిన చైర్మన్ సింగరేణి సీఎండీతో మాట్లాడుతానని తెలిపారు.

ప్రమాదవశాత్తు గోదావరిలో పడి యువకుడి మృతి

హాజీపూర్, జూన్ 21: ముల్కల్ల గోదావరి పుష్కరఘాట్ వద్ద స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నదిలో మునిగి యువకుడు మృతి చెందాడు. బెల్లం పల్లి మండలం దుబ్బపల్లి గ్రామానికి చెందిన చింతకింది ఉదయ్‌కిరణ్(22) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఉదయ్‌కిరణ్ అమ్మమ్మ ఇటీవల మృతి చెం దగా గోదావరి నది వద్ద పిండ ప్రదానం చేయడానికి శుక్రవారం ముల్కల్ల పుష్కరఘాట్‌కు వచ్చారు. ఉదయ్‌కిరణ్ నదిలోకి దిగి స్నానం చేస్తుండగా నీటిలో మునిగాడు. పోలీసులకు సమాచారం అందించడంతో జాలర్లతో నదిలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమి త్తం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

దొంగతనం కేసులో నిందితులకు రిమాండ్

ఏసీసీ, జూన్ 21: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో బియ్యం దొంగతనానికి పాల్పడిన నిందితులకు రామగుండం రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ రిమాండ్ విధిం చినట్లు రామగుండం రైల్వే ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. కుమరంభీంఆసిఫాబాద్ జిల్లా తిర్యాణికి చెందిన గుమ్ముల భీమయ్య మంచిర్యాల గోపాలవాడలో ఉంటున్నాడు. మంచిర్యాలలోని సాయికుంటకు చెందిన జనగామ దినేష్, మందమర్రి మండలం పులిమడుగుకు చెందిన కున్సోత్ వెంకటేష్, మంచిర్యాల తిలక్‌నగర్‌కు చెందిన అన్నెల వంశీలు మే 20న మంచిర్యాల రైల్వేస్టేషన్ యార్డులో ఆగి ఉన్న గూడ్స్ రైలులో 23 బియ్యం బస్తాలను దొంగలించారన్నారు. బస్తాలను గోపాల్‌వాడలోని గుమ్ముల భీమ య్య ఇంట్లో దాచి పెట్టారన్నారు. శుక్రవారం బియ్యం బస్తాలను మంచిర్యాల మార్కెట్‌లో అమ్మేందుకు వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను రామగుండం రైల్వే మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

సింగరేణి ఆస్పత్రుల్లో సౌకర్యాల లేమి

- కార్మికుల ప్రాణాలతో యాజమాన్యం చెలగాటం
- మావోయిస్టు పార్టీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అస్పత్రుల్లో యాజమాన్యం కార్మికులకు అవసరమైన కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. బొగ్గు గనుల్లో ప్రకృతికి విరుద్ధంగా కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల నివాసాలు, కాలనీలు, వీల్చేగాలి, తాగునీరు కలుషితం అవుతున్నాయని, కార్మిక కుటుంబాలు అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. లాభాపేక్షే ధ్యేయంగా ఉన్న యాజమాన్యం కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. సింగరేణి దవాఖానాల్లో వైద్యం అందని ద్రాక్షగా మారిందని, అపరిశుభ్రత, దుర్గంధం వెదజల్లుతున్నాయని పేర్కొన్నారు. ఎక్స్‌రే యంత్రాలు, స్కానింగ్ పరికరాలు పని చేయకపోవడం, వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా సరియైన వైద్యం అందడం లేదని తెలిపారు. యేటా స్పెషలిస్టులు, డాక్టర్లు, సిబ్బంది, సదుపాయాలను తగ్గిస్తున్నారని, డిస్పెన్సరీలను మూసివేస్తున్నారని దుయ్యబట్టారు. అధికార దర్పంతో కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న కొందరు వైద్యాధికారులు, కొన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు తమ పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. ప్రధానంగా భూపాలపల్లి ఏరియా హాస్పిటల్ అధికారి కొంతమంది వైద్యులు, గోదావరిఖని ఏరియా ఆస్పత్రి అధికారి, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌లు నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ వైద్య సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతున్నారని, హాస్పిటల్ మూసివేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని, అతని పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. సింగరేణి దవాఖానల్లో మెరుగైన చికిత్స అందించేందుకు ఆధునిక టెక్నాలజీ, స్పెషలిస్టు వైద్యులు, అన్ని రకాల మందులను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

బహుదూరపు బాటసారులు...



దండేపల్లి, జూన్ 21: ఎడారి ఓడలుగా పిలిచే ఒంటెలు దండేపల్లిలో దర్శనమిచ్చాయి... రాజస్థాన్, గుజరాత్ నుంచి ఉపాధి నిమిత్తం మూడు నెలల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తుంటారు... వారు పెంచుకునే గొర్రెలకు, ఒంటెలకు మేత మేపుతూ పర్యటిస్తుంటారు... కుటుంబ సమేతంగా వేల కిలోమీటర్ల దూరం సంచారం చేస్తున్నారు... రాత్రివేళ స్థానిక రైతుల పంటచేలల్లో మందలను నిలుపుతూ అందుకు ప్రతిఫలం గా నగదు, బియ్యం, ఇతర సామగ్రి తీసుకుం టున్నారు. శుక్రవారం మండలంలోని పలుప్రాంతాల్లో ఒంటెలు వెళుతూ అగుపించాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



కింద పడిన విద్యుత్ స్తంభాలు

చెన్నూరు, జూన్ 21: చెన్నూరు పట్టణంలో శుక్రవారం ఓ కారు బీభత్సం సృష్టించడంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి. ములుగు ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి వెళ్లి వస్తుండగా చెన్నూరు పెద్ద చెరువు వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. విద్యుత్ స్తంభం ధ్వంసం కాగా మరో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో రహదారి గుండా వాహనాలు వెళ్లకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని వాహ నాలను నిలిపివేశారు. విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌ను అడగగా కారు ఢీకొట్టడంతో మూడు స్తంభాలు ధ్వంసం కాగా ఒక విద్యుత్ స్తంభం నేలకొరిగిందన్నారు. దాదాపు లక్ష రూపాయల నష్టం జరిగిందన్నారు. నష్టాన్ని చెల్లిస్తామని పేర్కొనడంతో కేసు నమోదు చేయలేదని ఆయన పేర్కొన్నారు.

అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటాం



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చెన్నూరు, జూన్ 21: నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటామని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం రైతువేదికలో, పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్‌ల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. ఆరు గ్యారంటీల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యేపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అరుణ్‌కుమార్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు గనులపై కేంద్ర మంత్రి వ్యాఖ్యలు సరికావు

మందమర్రి టౌన్: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి గనులు వేలం వేస్తామని అనడం సరికాదని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్‌షాలు మినరల్ డెవలప్‌మెంట్ ప్లాంటును గుజరాత్‌కు ఎలా కేటాయించారో తెలంగాణకు బొగ్గు గనులను కేటాయించాలన్నారు. కేకే 6, శ్రావణపల్లికి బ్లాకులను సింగరేణికే కేటాయించాలన్నారు. సొత్కు సుదర్శన్, దుర్గం నరేష్, గుడ్ల రమేష్ పాల్గొన్నారు.

సులభ్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

మందమర్రిటౌన్, జూన్ 21: సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద పనిచేస్తున్న కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించాలని శుక్రవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జాఫర్ మాట్లాడుతూ సులభ్ కాంప్లెక్స్‌లను శుభ్రం చేస్తూ అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రతీ నెల జీతాలు ఆలస్యం అయితే వారి కుటుంబాల పోషణ కష్టంగా ఉంటుందన్నారు. సకాలంలో వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులకు వినతి పత్రం అందించారు. శ్రీనివాస్, ఈశ్వరి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల కార్మికుల వివరాలు ఇవ్వాలి

మందమర్రిటౌన్, జూన్ 21: ఇతర రాష్ట్రాల నుంచి మందమర్రికి వచ్చి పనిచేస్తున్న కార్మికులు వారి వివరాలను పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సిరామిక్స్, తదితర కంపెనీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులతో మాట్లాడారు. బీహార్, రాజస్థాన్, ఒరిస్సా, మహారాష్ట్ర నుంచి వచ్చిన వారి ఆధార్‌కార్డులు, ఇతర వివరాలను అందించాలన్నారు. పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదాలు జరిగితే యాజమానుల నుంచి బెనిఫిట్స్ వచ్చేలా చూడడానికే వివరాలు అడుగుతున్నామని తెలిపారు. ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

శిశువు మృతికి వైద్యులు కారణమని ధర్నా



ధర్నా చేస్తున్న మౌనిక కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు

బెల్లంపల్లి, జూన్ 21 : శిశువు మృతికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులే కారణమం టూ శుక్రవారం ఆసుపత్రి ఎదుట కుటుం బ సభ్యులు ధర్నా నిర్వహించారు. బూడిదగడ్డ బస్తీకి చెందిన శివాజీ మాట్లాడుతూ భార్య మౌనికకు పురుటి నొప్పులు, విరేచనాలు రావడంతో గత నెల 24న రాత్రి ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. మరుసటి రోజు మౌనికకు నొప్పులు వస్తున్నాయని, నార్మల్ డెలివరీ చేస్తామని వైద్యులు చెప్పారని పేర్కొన్నాడు. పుట్టిన మగ శిశువు ఆరోగ్య పరిస్థితి బాగా లేదని, మంచిర్యాలకు తరలించాలని చెప్పడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. అక్కడి వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకువెళ్లామని తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం శిశువు మృతి చెందిందన్నారు. ప్రసవ సమయంలో శిశువు తల ఎక్కువసేపు బయట ఉండడంతోనే బ్రెయిన్‌లో సమస్య ఏర్పడి శిశువు పరిస్థితి విషమంగా మారి మృతికి కారణమైందని ఎంజీఎం ఆసుపత్రి వైద్యులు సూచించారని ఆవేదన వ్యక్తంచేశాడు. శిశువు మృతికి బెల్లంపల్లి ఆసుపత్రి వైద్యులే కారణమని ధర్నా చేపట్టారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. టూ టౌన్ ఎస్ఐ రమేష్ బాధితులతో మాట్లాడారు. ఆసుపత్రి వైద్యులపై ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలపడంతో ధర్నా విరమించారు.

యోగా శరీర భాగాలను సమన్వయం చేస్తుంది: కలెక్టర్



ఆసనాలు వేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కాగజ్‌నగర్ బాలభారతిలో యోగా నేర్పిస్తున్న పతంజలి యోగా పీఠ్ గురువు అశోక్‌ఆర్య



దహెగాంలో యోగా ఆసనాలు వేస్తున్న ఉపాధి హామీ కూలీలు, సిబ్బంది

ఆసిఫాబాద్, జూన్ 21: యోగా శరీర భాగాలను సమన్వయం చేస్తుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన అధికారిక యోగా దినోత్సవానికి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, గిరిజన సంక్షేమశాఖ క్రీడా అధికారి మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. గుండెకు రక్తసరఫరా చేయడంలో ఉండే లోపాలను యోగాతో తొలగిపోతాయన్నారు. భారతదేశంలో ఉన్న యోగా ప్రాచుర్యాన్ని గుర్తించి ఆమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాలు కూడా పాఠశాలల్లో యోగా తరగతులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచి యోగా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాకేంద్రంలోని వివిధ పాఠశాలలవిద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం..

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో, సర్‌సిల్క్ దుర్గామాత మండపం వద్ద, బాలభారతి పాఠశాలలో, ఎస్పీఎం క్రీడామైదానంలో నిర్వాహకులు కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ యోగాచేయటంవల్ల దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవన్నారు. ఆయాకార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్య క్షుడు డాక్టర్‌శ్రీనివాస్, భారత్ స్వాభిమాన్ సంఘం జిల్లా ప్రభారి ఎం రవీందర్‌గౌడ్, దాసరి వినోద్‌గౌడ్, కొంగ సత్యనారాయణ, డాక్టర్ సుమిత్, జితేందర్ డాకుల్కర్, స్వాతిడాకల్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్/వాంకిడి/పెంచికలపేట/చింతలమానేపల్లి/బెజ్జూరు/దహెగాం/జైనూర్/కెరమెరి: జిల్లా కేంద్రంలోని తెలంగాణమోడల్ స్కూల్‌లో, ప్రభుత్వ పాఠశాలల్లో, కేజీబీవీల్లో శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. వాంకిడిలో పతంజలి యోగా ప్రచారక్ డొడ్డాజీ, యోగా సాధకులు ఆసనాలు వేసి వివరించారు. పెంచికల పేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామంలోని అమృత్‌సరోవర్ వద్ద ఉపాధిహామీ కూలీలతో యోగా నిర్వహించారు. బెజ్జూరులోని కేజీబీవీలో ప్రధానిమోదీ సందేశాన్ని దృశ్యశ్రవణ రూపంలో వీక్షింపజేశారు. దహెగాంలో ఉన్నత పాఠశాలల్లో, కేజీబీవీలో, ఉపాధిహామీ పనిప్రాంతంలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జైనూర్ మండలకేంద్రంలో, ఉషేగాంలోని ప్రభుత్వాసుత్రుల్లో వైద్యసిబ్బంది యోగా దినోత్సవం నిర్వహించారు.

గ్రామస్థులు తగ్గరు.. అధికారులు వినరు

- సమస్యాత్మకంగా ఇటిక్యాలపహాడ్ గ్రామం
- క్రమంగా గ్రామానికి చేరుకుంటున్న పులుల కారిడార్
- వినకుంటే గ్రామస్థులకే నష్టమంటున్న అధికారులు



గ్రామంలో సర్వేచేస్తున్న అధికారులు (ఫైల్)

సిర్పూర్(టి), జూన్ 21: మండలంలో రిజర్వుఫారెస్టులో ఉన్న ఇటిక్యాలపహాడ్ గ్రామపంచాయతీ ప్రజలకు కొన్ని సంవత్సరాలుగా అటవీఅధికారులతో వాగ్వాదం కొనసాగుతోంది. ఈ తరుణంలో రెవెన్యూ, అటవీశాధికారులు గ్రామస్థులతో చర్చలు జరిపారు. అయినా సమస్య కొలిక్కి రాలేదు. మూడు సంవత్సరాలుగా అటవీశాఖాధికారులు హరితహారంలో భాగంగా రిజర్వు ఫారెస్టులో ఉన్న రెండువేల ఎకరాల్లో సంవత్సరానికి రెండు వందల ఎకరాలచొప్పున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారు. దీంతో గ్రామంలో సాగు చేస్తున్న ప్రజలు వెనుతిరగాల్సిన పరిస్థితిఏర్పడుతు న్నది. ఇదిలా ఉండగా ఆరునెలల క్రితం కేంద్ర బృందం సభ్యులు గ్రామంలో పర్యటించి వన్యప్రాణులు, పులుల సంరక్షణ కోసం ఈ స్థలంను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర ప్రాంతం దగ్గర ఉండడంతో ఇక్కడ వన్య ప్రాణుల సంరక్షణకు ఏర్పాట్లు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. దీంతో ఈ ప్రాంతం పులుల కారిడార్‌గా మారే అవకాశం ఉందన్నారు. అయినా కూడా అటవీ, రెవెన్యూ శాఖాధికారులు సాగుచేసుకున్న రైతులకు రెండుఎకరాల చొప్పున సాగు భూమి ఇవ్వడానికి ఒప్పుకున్నారు. హరితహారం మొక్కలు నాటే కార్యక్రమానికి సహకరించాలన్నారు. కానీ గ్రామస్తులు ఒప్పుకోక భీష్మించుకుని కూర్చోవడంతో అన్నివిధాల నష్టపోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేయడంతో ఇటిక్యాలపహాడ్ గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి ఇక్కడ ఎన్నికలు కూడా జరిపారు. కాగా గతశాసనసభ ఎన్నికల్లో గ్రామంలో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో గ్రామస్థులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు గ్రామంలో ప్రత్యేకపోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఇక్కడ అన్నిఏర్పాట్లు చేస్తూనే తమభూములు ఇవ్వాలని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

కవ్వాల టైగర్ జోన్‌ను సందర్శించిన ఐఏఎస్ అధికారులు



కవ్వాల టైగర్ జోన్‌లో సందర్శిస్తున్న ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు

జన్నారం, జూన్ 21: కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో శుక్రవారం ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు పర్యటించారు. ఇందన్‌పల్లి రేంజ్‌లోని కామన్‌పల్లి, మైసమ్మకుంటతోపాటు వాచ్‌టవర్‌ను సందర్శించారు. నీటి కుంటలు, వన్య ప్రాణుల సంరక్షణకు చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అనంతరం టైగర్ జోన్‌లో ఉన్న వన్య ప్రాణులు వాటి లక్షణాల గురించి తెలుసుకున్నారు. వికారాబాద్, నిజామాబాద్, నారాయణపేట, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం అసిస్టెంట్ కలెక్టర్లు ఉమాహారతి, అజ్మీర సంకీత్‌కుమార్, గర్మినారుల, అభిగేన్ మాల్యా, అజయ్‌యాదవ్, మ్రినాల్ సుశ్రిత, సంగారెడ్డి ఐఈఎస్ఎస్‌డీ మనోజ్, ఎఫ్ఆర్‌వో హఫీజుద్దీన్, ఎఫ్ఎస్‌వో శివ, బీట్ అధికారులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 21 : సర్పంచుల పదవీ కాలం ముగియడంతో అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రణయ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో అధికారులు, కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తున్నారని, నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా వ్యవసాయాధికారులు ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేయాలని పలువురు ఎంపీటీసీలు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని కోరారు. ఎంపీడీవో శ్రీనివాస్, జెడ్పీటీసీ బానయ్య, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా వటసావిత్రి వ్రతం



కౌటాలలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 21: జిల్లా కేంద్రంలో శుక్రవారం మహిళలు జ్యేష్ట శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని వటసావిత్రి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడ, వాసవినగర్‌తోపాటు పలుకాలనీల్లో మహిళలు వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మర్రిచెట్టు(వటవృక్షం)కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యమధర్మరాజును ఎదిరించి తనభర్త ప్రాణాలను కాపాడుకున్న సావిత్రిదేవికి గుర్తుగావ్రతం నిర్వహించుకుంటున్నట్లు మహిళలు తెలిపారు.

బెజ్జూరు/వాంకిడి/కౌటాల/జైనూర్/కెరమెరి: మండలాల్లో శుక్రవారం వటసావిత్రివ్రతం సందర్భంగా మహిళలు మర్రిచెట్ల వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. మర్రిచెట్టుకు పసుపుతో తడిపిన దారాన్ని చుట్టి 108సార్లు ప్రదక్షిణలు నిర్వహిస్తారు. పూజల అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వాంకిడిలోమహిళలకు ఎంపీపీవిమలాబాయి తులసీ మొక్కలను అందించారు.

భూ వివాదంలో నలుగురి రిమాండ్

బెజ్జూరు, జూన్ 21: మండలంలోని అంబగట్టు శివారులో ఆదివారం భూవివాదంలో ఇరువర్గాలు పరస్పరం కర్రలు, గొడ్డలితో దాడిచేసుకున్న ఘటనలో శుక్రవారం నలుగురు వ్యక్తులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై విక్రం తెలిపారు. అంబగట్టు గ్రామానికి చెందిన పోరిశెట్టి సుగుణాకర్, జగదీష్, నానయ్య, నైతం సకారాం బూరుగుగూడ గ్రామానికిచెందిన తలండి మల్లయ్యతో పాటుమరోఇద్దరిపై దాడిచేసినఘటనలో వారిని అరెస్టుచేసినట్లుఎస్సై తెలిపారు.

ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించిన రీజినల్ డైరెక్టర్



ఆసుపత్రి వద్ద మాట్లాడుతున్న రీజినల్‌డైరెక్టర్ గాంగ్డే

కాగజ్‌నగర్, జూన్ 21: కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిని శుక్రవారం రీజినల్ డైరెక్టర్ గాంగ్డే సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవనాలను పరిశీలించారు. వర్షాల కాలం నేపథ్యంలో భవనం పరిస్థితి, ఇతర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీఐటీయూ నాయకులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఆసుపత్రిని తరలించే యోచనను మానుకోవాలని, మరమ్మతులు చేసి వినియోగంలోకి తెచ్చేలా చూడాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, కూశన్న రాజన్న, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పెంచికలపేట, జూన 21: మండలంలోని కొండపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. ఏఈ అంజల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కొండపల్లి గ్రామంలోని గొల్లగూడకుచెందిన బొల్లెబాయిన భీమయ్యకు చెందిన ఎద్దు గ్రామశివారులో మేత మేయడానికి వెళ్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న 11కేవీ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. బాధిత రైతుకునష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
6
శనివారం 22 జూన్ 2024

జోడేఘాట్‌ను సందర్శించిన ఎస్పీ


జోడేఘాట్‌ను సందర్శిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

కెరమెరి, జూన్ 21: మండలంలోని జోడేఘాట్ గ్రామాన్ని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మ్యూజియం సందర్శించి భీం మనుమడు సోనేరావుతో మాట్లాడి గిరిజన ఆచార, సంప్రదాయాలను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గిరిజనప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సాయం చేస్తామని తెలియజేశారు. భీంమనుమడు సోనేరావుతోపాటు గిరిజన నాయకులను సన్మానించారు.

మార్లవాయిని సందర్శించిన ఎస్పీ

జైనూర్: మండలంలోని మార్లవాయి గ్రామాన్ని ఎస్పీ శ్రీనివాస్‌రావ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం మార్లవాయిలోని విశ్రాంతిగృహంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. సీఐ అంజయ్య ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎస్సై సందీప్‌కుమార్, ఏఎస్సై ఉద్ధవ్, పోలీసులు పాల్గొన్నారు.

జోరుగా ఆన్‌లైన్ జూదం



కాగజ్‌నగర్‌లో ఆన్‌లైన్ జూదం విచ్చలవిడిగా కొనసాగుతోంది. రాష్ట్రంలో నిషేధం ఉన్నప్పటికీ పక్కనున్న మహారాష్ట్ర నుంచి నిర్వాహకులు ఆన్‌లైన్‌లో జిల్లా వాసులను ప్రలోభాలకు గురిచేస్తూ జూదం ఆడేలా చేస్తున్నారు. ఇందులో ఎక్కువగా నష్టపోతున్నది దినసరి కూలీలే..

పెడదారి పడుతున్న యువత

పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్ కేంద్రంగా కొనసాగుతున్న దందా

కాగజ్‌నగర్, జూన్ 21: అడ్డదారిలో అనతికాలంలో డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో యువత పక్కదారి పడుతోంది. ఆన్‌లైన్ జూదం, మట్కాపై డబ్బులు పెట్టి నిలువెల్లా మునిగిపోతున్నారు. పోయిన డబ్బు మళ్లీ గెలువవచ్చన్న కొండంత ఆశతో మళ్లీ మళ్లీ ఆడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఆటలో ఆడినవారు మునుగుతున్నారే తప్పా లాభపడిన దాఖలాలు లేవు. ఈ ఆటను నిర్వహిస్తున్న ఏజెంట్లు మాత్రం లక్షల్లో లాభాలు ఆర్జిస్తున్నారు. కాగజ్‌నగర్ కేంద్రంగా ఈ దందా కొనసాగుతోంది. పట్టించుకోవాల్సిన పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో దందా నిర్వాహకులకు ఆదాయం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వస్తోంది.

ఆన్‌లైన్ సైట్‌లో..

మట్కా జూదం ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణకు మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల వారు కాగజ్‌నగర్‌లో కొంతమంది ఏజెంట్లను పెట్టుకున్నారు. ఈ ఆటలో డబ్బులు పెట్టిన నెంబరు తాకితే రెండింతలు, మూడింతలు డబ్బులివ్వాల్సి ఉంటుంది. మట్కా నెంబరుపై డబ్బులను ఇక్కడి ఏజెంట్లు ముందస్తుగానే వసూలు చేస్తారు. ఆన్‌లైన్ సైట్‌లో బెట్టింగ్‌కు అంక్, సింగిల్ పత్తా, ట్రిపుల్ పత్తా, జోడి, డబుల్ పత్తా ఉంటాయి. ఇందులో పెట్టుబడులు పెట్టిన వాటికి 10రెట్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు రూ.100పెట్టుబడి పెడితే నెంబరు వస్తే రూ.1000వచ్చే అవకాశాలున్నాయి. అయితే అది అంత సులభం కాదు. ఆట ఆడి చాలా మంది నష్టపోతున్నారు. ఈ ఆటను తెలంగాణ రాష్ట్రంలో నిషేధం చేశారు. అయినప్పటికీ కూడా దొంగచాటుగా విచ్చలవిడిగా నడిపిస్తున్నారు. ఈ ఆటను అధికంగా దైనందిన కూలీలు ఆడుతున్నారు. పొద్దంతా కష్టపడి వచ్చిన డబ్బును ఈ ఆటలోనే పెట్టి నష్టపోతున్నారు. దీని నతంగా సెల్ ఫోన్ల ద్వారా నడిపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో డబ్బుల చెల్లింపు కూడా ఆన్‌లైన్ ద్వారానే చేస్తారు.

మట్కాలో ప్రధానంగా ఓపెన్, క్లోజ్ రెండు ఆటలు ఉంటాయి. మహారాష్ట్ర కేంద్రంగా నిర్వహిస్తారు. ముంబాయిలో మధ్యాహ్నం ఓపెన్ చేస్తారు. కళ్యాణి ఆటలో రాత్రి క్లోజ్ చేస్తారు. ముంబాయి ఆట ఫలితాలు మధ్యాహ్నం రెండు గంటలకు విడుదల చేస్తారు. అలాగే క్లోజ్ నెంబరు రాత్రి 10 గంటలకు ప్రకటిస్తారు. ఓపెన్ విభాగంలో సింగిల్ అంకెకు రూ.11 పెడితే రూ.100 ఇస్తారు. డబుల్ నెంబరుకు రూ.11 పెడితే రూ.500, ట్రిబుల్ డిజిట్ పానా గేంలో రూ.11 పెడితే రూ.1400ఇస్తారు. ఇలా ఒక్కో లెక్కలు చూపి అమాయకులకు ఆశ చూపిస్తున్నారు. మహారాష్ట్రలో ఈ ఆటకు నిషేధం లేక పోవటంతో పక్కనే ఉన్న గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కాగజ్‌నగర్‌కు నిత్యం ఆటలు ఆడేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ ఉండటంతో సెల్ ఫోన్‌లోనే నెంబర్లు చెప్పటం, డబ్బులు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చేసి ఆడిస్తున్నారు. పెట్టుబడులు పెట్టిన వారు మునిగి పోతున్నారే తప్పా లాభపడిన వారు ఎవరూ లేరని ఈ ఆట ఆడిన వారు చెబుతున్నారు.

కొరవడిన పోలీసుల నిఘా..

కాగజ్‌నగర్ పట్టణంలో మాట్కా అధికంగా నడుస్తోంది. పోలీసులు అడపాదడపా చిన్నపాటి కేసుల నమోదు చేస్తున్నారు. ఈ ఆటను పూర్తిగా అరికట్ట లేక పోతున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే నామమాత్రపు దాడులు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత యధావిధిగానే ఈ దందాను కొనసాగిస్తున్నారు. యువత చెడు మార్గం పట్టకుండా ఉండాలంటే ఇప్పటికైనా పోలీసులు మట్కా ఆటపై గట్టిగా నిఘా పెట్టాలి. అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయా కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

కేసులు నమోదు చేశాం..

శంకరయ్య, ఎస్‌హెచ్‌వో కాగజ్‌నగర్

మట్కా నిర్వహణపై తాము గట్టి నిఘా పెడుతున్నాం. మట్కా ఆడిన వ్యక్తుల వద్ద నుంచి చిట్టీలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నాం. ఎవరిని కూడా ఉపేక్షించేది లేదు. తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరిని కూడా వదిలిపెట్టం.

హైదరాబాద్‌కు వెళ్లిన పోడు రైతులు


రావి శ్రీనివాస్‌కు గోడు వెల్లబోసుకుంటున్న పోడు రైతులు

సిర్పూర్(టి), జూన్ 21: మండలంలోని ఇటిక్యాల పహాడ్ గ్రామానికి చెందిన 200మంది పోడురైతులు గురువారం రాత్రి బస్సుల్లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. శుక్రవారం సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి పోడుభూముల విషయమై సంబంధితశాఖ మంత్రికి సిఫారసు చేయాలని వేడ్కొన్నారు. తమను అటవీశాఖాధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవిచంద్, రైతులు ఉన్నారు.

కెరమెరి, దహెగాంలలో వర్షం


వాగు ఇవతల నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులు

కెరమెరి, జూన్ 21: మండలంలో అనార్‌పల్లివాగు ప్రవహించడంతో జన్కాపూర్, కరంజీవాడ తదితర గ్రామాల ఉపాధ్యాయులు శుక్రవారం వాగు వద్ద సుమారు మూడు గంటల పాటు నిరీక్షించారు. గురువారం రాత్రి మండలంలో వర్షం కురియడంతో వాగు ప్రవాహం పెరిగింది. దీంతో అవతలివైపు గ్రామాల ప్రజల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. ఉదయం పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు వాగువరకు చేరుకుని వరదఉధృతి తగ్గే వరకు సుమారు మూడుగంటలపాటు అక్కడే నిరీక్షించారు. వాగు ప్రవాహం తగ్గుముఖం పట్టిన తరువాత పాఠశాలలకు వెళ్లారు.

దహెగాం: మండలవ్యాప్తంగా శుక్రవారం వర్షం కురిసింది. పత్తివిత్తనాలు విత్తుకున్న వర్షంమేలు చేస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు యోగా డే కష్టాలు


పరుపు మోసుకుపోతున్న విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 21: జిల్లాకేంద్రంలోని ఆదివాసీ భవనంలో శుక్రవారం నిర్వహించిన యోగా దినోత్సవం క్రీడా పాఠశాల విద్యార్థులకు కష్టాలు తెచ్చింది. యోగా దినోత్సవం సందర్భంగా యోగా చేయడానికి ప్రతిఒక్కరికి కింద వేసుకోవడానికి మ్యాట్‌లు వాడగా ముఖ్య అతిథులకు మ్యాట్‌కు బదులు విద్యార్థులు బల్లలపై వాడే పరుపులు వేశారు. దీంతోపాటు పాఠశాలకు చెందిన కుర్చీలు కూడా వేదిక కోసం తీసుకువచ్చారు. అయితే వేడుకలు పూర్తైన తరువాత తీసుకువచ్చిన వస్తువులు పక్కనేఉన్న తమ పాఠశాలకు విద్యార్థులు మోసుకుంటూవెళ్లారు. పాఠశాలకు చెందిన అటెండర్లు, ఇతరకిందిస్థాయి సిబ్బందిచేయాల్సిన పనులువిద్యార్థులతో చేయించడంపై అక్కడేఉన్న వారుఖండించారు. వేడుకలపేరుతో విద్యార్థులతోపని చేయించడం, విద్యార్థులు కూడా చేసేదేమిలేక వస్తువులు మోసుకెళ్లడం కనిపించింది.

మంత్రి సీతక్కను కలిసిన మండల నాయకులు


సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జైనూర్, జూన్21: జైనూరు ఏజెన్సీలో ప్రత్యేకవసతులు కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండలనాయకులు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావ్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదారాబాద్‌లో మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని వారు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె సానుకూలంగా స్పందించారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్‌పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, మార్లవాయి తాజామాజీ సర్పంచ్ కనకప్రతిభ వెంకటేష్ పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

● రూ.20వేల జరిమానా

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 21: అత్యాచారయత్నం కేసులో నిందితుడికి పదిసంవత్సరాల జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్‌కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఆసిఫాబాద్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన వివాహితతో వరుసకు మామ అయిన నిందితుడు చునార్కర్ ముకుందరావు అనేవ్యక్తి చేను పనిమీద వెళ్లిన ప్రతిసారి తన కోరిక తీర్చమని వెంటపడేవాడు. ఒప్పుకోక పోయేసరికి వేరేవాళ్లతో అక్రమసంబంధం ఉందని నానా బూతులు తిడుతూ చెడుగా ప్రచారం చేస్తుండేవాడు. 2021జనవరి 5న రాత్రి తన మహిళ భర్త ఇంట్లో లేని సమయం చూసి అక్రమంగా ప్రవేశించి ఆమె చేయి బట్టి లాగి ఆమెను అత్యాచారం చేయబోయాడు. అదే సమయానికి ఆమె భర్త వచ్చేసరికి అతనిని చూసి పారిపోయాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేశ్వర్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో ప్రవేశపెట్టాడు. పీపీజీవీఎస్ ప్రసాద్ సాక్షులను విచారించగా నేరం చేసినట్లు రుజువు కావడంతో నిందితుడు ముకుందరావుకు పదిసంవత్సరాల జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషిచేసిన ప్రస్తుత సీఐ సతీష్, ఎస్సై రాజేశ్వర్, కోర్టు డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీశ్రీనివాస్ అభినందించారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన ఉదయ్‌రాంప్రసాద్

జైనూర్, జూన్ 21: జైనూర్ గ్రామ ఇన్‌చార్జి ఈవోగా ఉదయ్ రాంప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఈవో శ్రీనివాస్ రెడ్డిని వాంకిడి మండలానికి డిప్యూటేషన్ వేసింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఈవో ఉదయ్ రాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్థులకు న్యాయంజరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ఆసిఫాబాద్, జూన్ 21: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, అతిసార ఇతర సీజనల్ వ్యాధులు నియంత్రణపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆహారం, తాగునీటిని తీసుకోవడంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నిరోధక చర్యలు చేపట్టాలని తెలిపారు. వారంలో రెండు రోజులు డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రవాణాసౌకర్యాలు లేనిగ్రామాల్లో గర్భిణులను గుర్తించి ప్రాథమికఆరోగ్యకేంద్రం సమీపంలోని వారి బంధువుల ఇళ్లలో, ఆసుపత్రుల్లో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమలను అరికట్టేందుకు ఆయిల్‌బాల్స్‌ను వేయాలని తెలిపారు. చేతి పంపులు, తాగునీటి బావులు, వాటర్ ట్యాంకులలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు పాఠశాలలు, వసతిగృహాలు, ఆశ్రమపాఠశాలల్లో ప్రతివారం రెండురోజులు డ్రైడే నిర్వహించేలా చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై సమయాను సారంగా వైద్యశిబిరాలు నిర్వహించాలని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా అవసరమైన మేర ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలి..

జిల్లాలో అమ్మఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. శుక్రవారం వాంకిడి మండలం ఘాట్ జనగాంలోని మండలపరిషత్ ప్రాథమికపాఠశాలలో పనులను జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల పనులు తుదిదశకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో జరుగుతున్న అన్ని ఆదర్శ పాఠశాల పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తిచేయాలన్నారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో కూడుకొని ఉండాలన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పనలో నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. పాఠశాలల ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయసారిని పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యఅందించాలని అప్పుడే విద్యావ్యవస్థపై మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎంపీడీవో వరలక్ష్మి, ఏపీఎం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి..

వర్షాకాలం కావున ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఏఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో గత అనుభవాల దృష్ట్యా అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజారక్షణ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వరదలకు గురయ్యే గ్రామాలను గుర్తించి ప్రజలనుసురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.


పాఠశాలను సందర్శిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ప్రజల సౌకర్యార్థం కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలని తెలిపారు. పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని రహదారులు, వంతెనలు, కల్వర్టులు తెగిపోకుండా వెంటనే పనులు పూర్తిచేయా లన్నారు. ఆసిఫాబాద్ మండలం గుండివాగు, కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి వంతెనల స్థితిగతులను పరిశీలించి తగు ఏర్పాటు చేయాలన్నారు. అందవెల్లి వంతెన పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల న్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో మురికికాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీసి శుభ్రపర్చాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో శిథిలావస్థలో ఉన్న గృహాల యజమానులకు నోటీసులు జారీచేసి వారికి పునరావాసం ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అగ్నిమాపకశాఖాధికారులు వరద ప్రభావితప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బందిని ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజఈతగాళ్ల, బోట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వరద ప్రభావిత ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకనిఘా ఏర్పాట్లు చేయాలన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో వేలాడే విద్యుత్‌తీగలు, వంగిన, విరిగిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్‌తీగలపై చెట్లు కూలినట్లయితే సంబంధిత శాఖాధికారులు సమన్వయంతో వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భారీనీటి ప్రాజెక్టులు, కాలువలు, చెరువులకు సంబంధించిన ఏమైనా మర మ్మతులు ఉంటే వెంటనే పూర్తిచేయాలన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లలో ఏమైనా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని.. ప్రజలకు సురక్షిత నీరు అందించాలన్నారు. వరదలతో రవాణా సౌకర్యంలేని గ్రామాల్లో నిత్యావసర సరుకులు అందించేం దుకు నాలుగునెలల స్టాక్‌ను ఉండేలా తరలించి నిల్వ చేయాలన్నారు. పిడుగులు పడే సమయంలో ప్రజలుచెట్ల వద్ద, విద్యుత్ స్తంభాల వద్ద ఉండకుండా అవగాహన కల్పించాలన్నారు. ఉద్యాన వన, వ్యవసాయశాఖల అధికారులు సమన్వయంతో పంట నష్టాలపై సమగ్రవిచారణ జరిపి నివేదికలు రూపొందించాలని తెలిపారు. తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్ర మంలో సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్ కల్పించాలి

ఆసిఫాబాద్, జూన్ 21: రాష్ట్రంలోగిరిజనులకు పదిశాతం రిజర్వేషన్ కల్పించాలని సేవాలాల్‌సేన నాయకులు శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవోనెం.33కు ప్రభుత్వం వెంటనేచట్టబద్ధతకల్పించి ఏజెన్సీప్రాంతాల్లో కొనసాగించాలని కోరారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 21: మహిళాసంఘాలు తీసుకుంటున్న రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో చెల్లించాలని టీజీబీ జనరల్‌మేనేజర్ రమేష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రాజంపేటబ్యాంకులో 61మహిళాసంఘాలకు రూ.4కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కును బ్యాంకు రీజనల్‌మేనేజర్ ప్రభుదాస్‌తో కలిసి పంపిణీ చేశారు. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచిమేనేజర్ విశ్వనాథ్, కెరమెరి, వాంకిడి మేనేజర్లు శ్రీపాద్,విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నీట్‌ను రద్దు చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 21: నీట్‌ను రద్దు చేసి అధికారులపై వెంటనే విచారణజరిపి చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో ప్లకార్డులో నిరసన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు నిలువుటద్దమైన జాతీయపరీక్షలు ప్రస్తుతం డోలాయమానంలో కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికృష్ణ, వి సాయికుమార్, పీడీఎస్‌యూ నాయకులు తిరుపతి, హరిశ్చంద్రప్రసాద్, డీవైఎఫ్ఐ నాయకులు టికానంద్, పురుషోత్తం, శ్రావణి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే దుకాణం సీజ్ చేస్తాం

సిర్పూర్(టి), జూన్ 21: విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, నకిలీలు విక్రయించినా దుకాణం సీజ్ చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, నిలువఉన్న ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. ఆధార్‌కార్డు ప్రకారమే రైతులకు విత్తనాలను విక్రయించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

దహెగాం: మండలంలో పత్తిపంటను జిల్లా వ్యవసా యాధికారి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం పత్తివిత్తనాలు 40శాతం మొలకెత్తినట్లు తెలిపారు. అయినంలో పత్తిచేన్లను పరిశీలించిక్రాప్ బుక్‌లో నమోదు చేశారు. ఆయనవెంట ఏఈవో జ్ఞానేశ్వర్ ఉన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి

బెజ్జూరు, జూన్ 21: మండలకేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం


ఎస్టీపీపీలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

మందమర్రి టౌన్, జూన్ 21: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మందమర్రి ఏరియా సేవాసమితి అధ్యక్షురాలు సవిత మనోహర్ తెలిపారు. శుక్రవారం సింగరేణి పాఠశాల యోగా కేంద్రంలో అంతర్జాతీయ యోగా వేడుకలకు హాజరై మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ నిత్యం మహిళలు వ్యాయామం, యోగా చేయాలన్నారు. అనంతరం ఆమె అందరితో కలిసి యోగా చేశారు. నిరంతరం పనిఒత్తిడిలో ఉండే ఉద్యోగులు కొద్దిసేపు యోగాచేయడం అలవర్చుకోవాలని జీఎం మనోహర్ అన్నారు. యోగా దినోత్సవం రోజే కాకుండా ప్రతిరోజు యోగా దినోత్సవంలా యోగా చేయాలన్నారు. అనంతరం అందరితో కలిసి జీఎం యోగా చేశారు.

జైపూర్: జైపూర్ ఎస్టీపీపీలోని ఓపెన్ ఆడిటోరియంలో మాస్ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డితోపాటు అధికారులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు జేఎన్‌సింగ్, సుధాకర్‌పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. జీఎం కార్యాలయంతోపాటు అన్ని గనులు, విభాగాలలో యోగా నిర్వహించారు. ఎస్ఆర్పీ3,3ఏ,ఆర్కే6గనిపై నిర్వహించిన యోగా వేడుకల్లో మేనేజర్ ఎస్ సంతోష్‌కుమార్, రక్షణాధికారి శ్రీధర్, సంక్షేమాధికారి గౌస్‌పాషా, మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీపై యోగా వేడుకలు నిర్వహించగా, పీవో శ్రీనివాస్, మేనేజర్ బ్రహ్మాజీ, యోగా గురువులు గడ్డం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిజిఎం రవీందర్, పిట్ కార్యదర్శి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: గోలేటి జీఎం కార్యాలయంలో యోగాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలి,ఏజీఎంతిరుమల్‌రావు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలంపై మండిపడ్డ సింగరేణీయులు

● గనులపై ఆందోళనలు, అధికారులకు వినతిపత్రాలు ● కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం


కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, జూన్ 21: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా సింగరేణి కార్మికులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఏరియాలోని అన్ని గనుల, డిపార్టుమెంట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కేంద్రానికి వ్యతిరేకంగా నిరసనలు చేశారు. కేకే5, కేకేఓసీ, ఏరియాస్టోర్స్, శాంతిఖని, వర్క్‌షాపు, సివిల్ డిపార్టుమెంట్, ఆర్కే1ఏ గనుల వద్ద ఐక్యకార్మికసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికసంఘాల నాయకులు మాట్లాడుతూ విచ్చలవిడిగా వేలం వేసి సింగరేణియుల ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగించే చర్యలను ఊరుకోమన్నారు. ఈ వేలాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీనిపై ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్, నారాయణ, జే శ్రీనివాస్, వెల్ది సుదర్శన్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు జె శ్రీనివాస్, కృష్ణ, మేకలరాములు, గుర్తింపుసంఘం ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శిసలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్ పాల్గొన్నారు.

మందమర్రి రూరల్ (కాసిపేట): కాసిపేట గనిపై కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని బొగ్గుగనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్‌చేశారు. కాసి పేట2 గనిపై కార్మికులు, సీఐటీయూనాయకులు నిరసన వ్యక్తం చేశారు.

శ్రీరాంపూర్: బొగ్గుగనులను సింగరేణికి కేటాయించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ముష్కెసమ్మయ్య, బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు అన్నారు. తెలంగాణబిడ్డ కిషన్‌రెడ్డికేంద్ర బొగ్గుగనులమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం సంతోషకరంఅయినా, సింగరేణిని కాపాడేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలోబ్రాంచ్‌సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, ఏరియాకార్యదర్శులు పాల్గొన్నారు.సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌ఏరియాలోశుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్అండ్‌పీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల గైర్హాజరు కావడం దురదృష్టకరం

శ్రీరాంపూర్, జూన్ 21: ఉపరితలంలో పనిచేసే ఉద్యోగులు కూడా విధులకు ఉద్యోగులు గైర్హాజరు కావడం దురదృష్టకరమని ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమరెడ్డి అన్నారు. ఎస్ఆర్పీ ఓసీపీలో పనిచేస్తూ విధులకు గైర్హాజరవుతున్న 13మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పి. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ పరీక్షలకు 285మంది అర్హత

శ్రీరాంపూర్, జూన్ 21: ఈపీ ఆపరేటర్ రాత పరీక్షలకు 285మంది అర్హత సాధించినట్లు జీఎం బి సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 18నుంచి 21వరకు నిర్వహించిన ఈపీ ఆపరేటర్(ట్రైనీ) ప్రాక్టికల్ పరీక్షలకు 543 మందికిగాను 498మంది హాజరు కాగా, ఇందులో 285 మంది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు చెప్పారు.